క్లుప్తంగా

తాగునీటి సమస్య రానివ్వొద్దు..

పెనుబల్లి: రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని రక్షిత మంచినీటిశాఖ డీఈ జయలక్ష్మి సూచించారు. శనివారం అధికారులతో కలిసి మండల పరిధిలోని పలు గ్రామాలను పరిశీలించి మాట్లాడారు. నీటి ఎద్దడి రాకుండా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని, మిషన్ భగీరథ నీటితో పాటు, గ్రామాల్లో అందుబాటులో ఉన్న బోర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. వాటర్ లీకేజీలకు మరమ్మతులు నిర్వహించి.. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చింతకాని ఎంపీడీఓగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

చింతకాని: చింతకాని ఎంపీడీఓగా చుంచు శ్రీనివాసరావును నియమిస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చింతకాని ఎంపీడీఓగా పనిచేస్తున్న రామయ్య డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేయటంతో బోనకల్ ఎంపీడీఓ రమాదేవికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఈజీఎస్ క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న చుంచు శ్రీనివాసరావును ఎంపీడీఓగా నియమించారు.

తల్లాడ తహసీల్దార్‌గా సురేష్‌కుమార్


సురేష్‌కుమార్

తల్లాడ: తల్లాడ తహసీల్దార్‌గా వి.సురేష్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వనజ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో కూసుమంచి నుంచి సురేష్‌కుమార్ ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. దీంతో తహసీల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టల్ ఉద్యోగికి సత్కారం


పోస్టల్ ఉద్యోగి రామాచారిని సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: కిష్టారం పోస్టల్ ఉద్యోగి టి.రామాచారి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం స్థానిక తపాలా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొడిమెల అప్పారావు, పోస్టల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్, రాజు, సురేష్, డి.నందన, సాగర్, పల్లవి పాల్గొన్నారు.

సింగరేణి జీఎం షాలెంరాజుకు వినతి


జీఎంకు వినతిపత్రం అందిస్తున్న నరసింహారావు

సత్తుపల్లిరూరల్: కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజును శనివారం ఆయన కార్యాలయంలో ఏరియా అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఎంవీ. నరసింహారావు, అధికారులు కలిసి పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే ఇవ్వాలని వినతిపత్రం అందించారు. 2022-23, 2023-24లో ఉత్పత్తి లక్ష్యాలను సాధించటంలో అధికారుల పాత్ర ఎంతగానో ఉందని పేర్కొన్నారు. దీనిపై జీఎం షాలెంరాజు మాట్లాడుతూ.. పీఆర్‌పీ ఇప్పించటంలో తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు రమేష్, శ్రీనివాస్, ఉపేందర్‌బాబు, ప్రదీప్, రావు, యాదగిరి, శేషశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

వైరా: వైరా శాంతినగర్‌లోని మేరీ ఇమ్మాక్యులేట్ హైస్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిస్టర్ మీనా, హెచ్‌ఎం సిస్టర్ యమున విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలకు చేరకోవాలన్నారు. బాగా చదివి మీ ఊరికి, తల్లిదండురలకి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిస్టర్ బెనెట్, సిస్టర్ ప్రతిభ, సిస్టర్ జెసింత, సిస్టర్ సుమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ రైళ్లు ఇక ఆగవా..


మధిర రైల్వేస్టేషన్

మధిర స్టేషన్‌లో రెండు రైళ్లకు హాల్టింగ్ రద్దు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో స్థానికులు

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 5నుంచి హాల్టింగ్ సౌకర్యాన్ని తొలగించారు. పద్మావతి ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబర్ (12763) మధిరలో రైల్వే అధికారులు మరోసారి హాల్టును తీసివేయడంతో తిరుపతి నుంచి మధిరకు రావాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి ఈ ప్రాంతం నుంచి నిత్యం వందలాది మంది భక్తులు వెళ్తుంటారు. స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో 'పద్మావతి'మధిరకు అర్ధరాత్రి 12:14 గంటలకు వస్తుంది. కానీ ఇక్కడ హాల్టింగ్ తీసేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు పలుమార్లు మధిర రైల్వేస్టేషన్‌లో హాల్ట్ రద్దు చేయడం జరిగింది. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు కండిషనల్ హాల్ట్ ఇవ్వడం జరుగుతుంది. మధిర కంటే తక్కువ ఆదాయం కలిగిన నెక్కొండ, కేసముద్రం వంటి రైల్వే స్టేషన్లలో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు ఆగుతుంటే, వాటికంటే ఆదాయం ఎక్కువగా కలిగిన, ఆంధ్ర సరిహద్దులో ఉన్న, నియోజకవర్గ కేంద్రమైన మధిర రైల్వేస్టేషన్‌లో ఈ ట్రైన్‌కి ఎందుకు హాల్టింగ్ ఇవ్వడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్ కూడా..

విశాఖపట్నం నుంచి మహబూబ్ నగర్ (12861) వెళ్తున్న ట్రైన్‌కు గతంలో మధిరలో హాల్ట్ ఉండేది. కానీ అధికారులు ఈ ట్రైన్‌కు కూడా హాల్టింగ్ రద్దు చేశారు. మహబూబ్ నగర్ నుంచి విశాఖపట్నం వెళ్లే (12862) ఎక్స్‌ప్రెస్‌కు మధిరలో హాల్ట్ ఇచ్చిన అధికారులు తిరుగు ప్రయాణంలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. గతంలో గౌతమి, సింహపురి, లక్నో ఎక్స్‌ప్రెస్‌లకు కూడా మధిరలో హాల్టింగ్ ఇవ్వాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. మధిర కంటే ఎర్రుపాలెం చిన్న స్టేషన్ అయినప్పటికీ అక్కడ లక్నో ఎక్స్‌ప్రెస్ ఆగుతుంది, కానీ మధిరలో ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఈ ప్రాంత ప్రయాణికులు ఎప్పటినుంచో కోరుతున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా మధిరలో ఆపాలని కోరుతున్నారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సమస్యలపై గత అనేక సంవత్సరాలుగా ఎంతోమంది ప్రజాప్రతినిధులకు ఇచ్చిన వినతిపత్రాలు బుట్ట దాఖలవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి..



గతంలో మధిర రైల్వే స్టేషన్లో ఆగినటువంటి పద్మావతి, మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి. ఇదే టైంలో ఆ ప్రాంతానికి వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో అదే రైలు బండికి వస్తారు.. ఈ క్రమంలో హాల్టింగ్ సౌకర్యం తొలగిస్తే ప్రయాణికులు ఎలా రావాలి. ఇది ఎంతవరకు కరెక్ట్.

– కాలం యుగంధర్, మధిర

ఇబ్బంది పడుతున్నాం..



అనేక ట్రైన్లకు హాల్టింగ్ సౌకర్యం తొలగించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆంధ్రాకు సరిహద్దు ప్రాంతమైన మధిరకు ఆక్కడి ప్రజలు మధిరకు వచ్చి రైలులో పలు ప్రాంతాలకు వెళ్తుంటారు. ఆదాయం మంచిగా ఉన్న మధిర స్టేషన్‌లో రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేయడం సమంజసం కాదు.

– హఫీజ్, మధిర

ఉద్యమాలు చేపడతాం..



తెలంగాణ రాష్ట్రంలో సరిహద్దులో ఉన్న మధిర ప్రాంతం అనేక విషయాల్లో వివక్షకు గురవుతుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో మధిర రైల్వే స్టేషన్ పెద్దగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణ చేపడుతాం.

– పడకంటి మురళి, సీపీఎం పట్టణ కార్యదర్శి, మధిర

'ఎన్‌ఎంఎంఎస్'కు విద్యార్థుల ఎంపిక


వైరా: వర్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వైరా: వైరాలోని 6వ వార్డుకు చెందిన చీదిరాల వేద వర్షిత నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యింది. ఆమె వైరాలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. దీంతో ఆమెను పాఠశాల హెచ్‌ఎం వెంకటమల్లేశ్వరి, ఉపాధ్యాయులు గాయత్రి, సరళ, రమాదేవి, నాగమణి, సుశీల రాణి, రామలక్ష్మి, అభినందనలు తెలియజేశారు.

సత్తుపల్లిలో..


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జశ్విత, ధనవర్ష, ఉమశ్రీ, లాస్య, నవ్య, సన, యోగిత, తనుశ్రీ, త్రిషాలిని, ఆఫ్రీని, గీతిక, మాలిహ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికకావడంతో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముదిగొండ: మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదిమంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. కావున శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. వీరిలో జిల్లాస్థాయి ప్రథమస్థానంలో జీవనమాధురికి మెమెంటో అందించి అభినందించారు. విద్యార్థులకు ఇంటర్‌వరకు సంవత్సరానికి రూ.12వేల స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

కాకర్లపల్లి పాఠశాలలో..


విద్యార్థులతో ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం ఎస్.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, మురళీమోహన్, రమేష్ అభినందించారు.

గేటు మూయడం సరికాదు

వైరా: ఖమ్మంజిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బస్సులు వచ్చే.. వైరా ఆర్టీసీ బస్టాండ్ కొత్తగూడెం రోడ్డు గేటు మూసేయడం సరికాదని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ వైరా ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. గతంలో మాదిరిగానే గేటు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు ముళ్లపాటి సీతారాములు, చెరుకూరి చలపతిరావు, చింతనిప్పు చలపతిరావు, కట్టా కృష్ణార్జునరావు, మద్దెల రవి, తాళ్ల సత్యం, ఎస్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

పరామర్శ..


వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లింగాల కమల్‌రాజు

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బుంగా వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం మృతుని కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసరావు, అప్పారావు, లెనిన్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

గంగారం పంచాయతీ కార్యదర్శి మృతి..

కల్లూరు: కల్లూరు విద్యానగర్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి జీనుగు సీతారాములు(55) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. సీతారాములు ప్రస్తుతం సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారంలో పంచాయితీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

సీపీఐ నాయకుల నివాళి


మురళి భౌతికకాయానికి పార్టీ జెండా కప్పుతున్న సీపీఐ నాయకులు

చింతకాని: మండలంలోని రాఘవాపురంలో దొబ్బల మురళి మృతదేహం వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు శనివారం నివాళులర్పించారు. మురళి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రవి, మండల సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మల్లికార్జున్‌రావు..

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి చెందిన సీనియర్ రేషన్ డీలర్ దారా మల్లికార్జున్‌రావు(91) శనివారం మృతి చెందాడు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఆకస్మికంగా మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని డీలర్ల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు రాజేశ్వరరావుతో పాటు పలువురు డీలర్లు, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు సందర్శించి నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పుణ్యపురం లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా కేశవాపురం, పుణ్యపురం గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కుర్నవల్లి విద్యుత్ సెక్షన్ అధికారి దారా కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

మసీద్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన మసీద్ కమిటీ సభ్యులు

వైరారూరల్: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో గల హజరత్ అలీ ఇబ్నెతాలీబ్ మసీద్ (వర్కుస్) కమిటీ ఎన్నికను శనివారం మత పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్.రసూల్ సాహెబ్, ఉపాధ్యక్షుడిగా షేక్.మీరా, కార్యదర్శిగా షేక్.గౌస్, కోశాధికారిగా అబ్దుల్ రెహమాన్, గౌలవదారుగా షేక్.సొందు సాహెబ్, షేక్.వలీజాన్‌తో పాటు మరో 8 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షేక్.రసూల్ సాహెబ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో ×షాదీఖానా×నిర్మాణం, ×ఈద్గా×స్థలం కొరకు తమ వంతు కృషి చేసి మసీద్ అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్.కౌసర్, మీరా, సయ్యద్ అన్వర్, రంజాన్, సయ్యద్ అహ్మద్, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

బోనకల్: మండల కేంద్రానికి చెందిన పెంటెల వంశీ ఈనెల 4నుంచి కానరాకుండా పోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. బోనకల్‌కు చెందిన వంశీ(23) తన మేనమామ మంకెన రాంబాబు ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. ఈనెల 4న వాహనంపై వెళ్లి తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

సభను జయప్రదం చేయండి

కొణిజర్ల: నేడు ఖమ్మంలో జరిగే గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి హెచ్.సురేష్ పిలుపునిచ్చారు. శనివారం కొణిజర్లలో ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామీణ వైద్యులంతా సకాలంలో సభకు హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఘనంగా ఫ్రూట్స్ డే

మధిర: ఆత్కూరు సమీపంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం ఫ్రూట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పండ్లు, కూరగాయలు వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ చందు, ప్రిన్సిపల్ అంజన్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం


సత్తుపల్లిరూరల్: స్థానికులను పరీక్షిస్తున్న వైద్యులు

పెనుబల్లి: వీయంబంజర్ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వీయంబంజర్ హైస్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి 200 మందికి పైగా హాజరు కాగా వారికి ఖమ్మం మమత ఆస్పత్రి మరియు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11మందిని జనరల్ సర్జరీకి, ఇద్దరిని గుండె ఎంజాగ్రమ్ చికిత్స కోసం, నలుగురిని పక్షవాతంకు సంబంధించి వైద్యానికై ఖమ్మం మమత ఆస్పత్రికి తరలించినట్లు నిర్వాహకుడు జెన్నారెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో రూ.1,20,000 విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌సాయి, జాహ్నవిరెడ్డి, సీహెచ్ చందన, విశ్వజ, స్మృతి, శ్రీనిధి, దీపిక, మానస, పీఆర్‌వో నాగేశ్వరరావు, నిర్వాహకులు విజయ పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో..

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కిష్టారం గ్రామంలో అంబేద్కర్, ప్రాథమిక పాఠశాల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి.. ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీఓ ఎంవీ నర్సింహారావు, వైద్యురాలు శిరీష, పంచాయతీ కార్యదర్శి రమణ, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

తల్లాడ: విశ్వబ్రాహ్మణ తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తల్లాడలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. స్థలదాత రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఆస్థాన పండితుడు రామడుగు నరసింహాచారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రుద్రాక్ష నరసింహాచారి, ప్రధాన కార్యదర్శి తాటికొండ కృష్ణ, కోశాధికారి గంటల వెంకటాచారి, ఉపాధ్యక్షులు ఇందోజు రవి, పరిపూర్ణాచారి, బాజోజు శేషభూషణం, కొక్కొండ వాసు, బండారు బ్రహ్మం, పద్మావతి పాల్గొన్నారు.

సాగర్ జలాల కోసం రైతుల నిరసన

వైరారూరల్: మండలంలోని వల్లాపురం గ్రామ రైతులు సాగర్ జలాల కోసం శుక్రవారం అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. వల్లాపురం సాగర్ మేజర్ కాలువ పరిధిలో వల్లాపురంతో పాటు చింతకాని మండలం ప్రొద్దుటూరు, బోనకల్ మండలంలోని లక్ష్మీపురం, గోవిందపురం గ్రామాలకు అనుసంధానంగా ఉంది. వల్లాపురం మేజర్ సాగర్ కాలువ ఆయకట్టు కింద సుమారు 230 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. సాగర్ జలాలు 10 రోజులకు ఒకసారి వారబంధీ ప్రకారం విడుదల చేస్తుండడంతో చివరి భూములకు నీరు చేరడంలేదు. ఈ వారబంధీ ప్రకారం పదిరోజుల నీరు నిలిపియడంతో రైతులు పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సంబందింత శాఖాధికారులు ఎగువ ప్రాంతాల్లోని పొలాలకు నీరందించేదుకు వల్లాపురం మేజరు కాలువకు తూము వేశారు. కంకిదశలో ఉన్న మొక్కజొన్న పంటలు ఎండిపోతుంటే తూము వేయడం ఎంటని ప్రశ్నిస్తూ రైతులు నిరసన తెలుపగా.. అధికారులు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలుపడంతో వారు నిరసన విరమించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన


చిన్నారికి అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ.. పిల్లలకు ఆరునెలలు నిండేవరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని తరువాతనే పోషకాహారం అందించాలని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన దామాల శ్రీనివాస్, శ్రీలత దంపతులు అంగన్‌వాడీ పిల్లలకు చాపలు, పలుకలు, బలపాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భాగం లక్ష్మి, ఉపాధ్యాయులు ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

వైరా: రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల విధుల నుంచి జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని ఎన్నికల సంఘానికి వినతిపత్రం పంపినట్లు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ 475 రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వసుకుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయని, పబ్లిక్ పరీక్షలు కూడా త్వరలోనే ఉన్నాయన్నారు. సిబ్బంది, అధ్యాపకులకు శిక్షణ ఈ నెల 15లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండింటికి హాజరు కావడం సాధ్యం కాదు కాబట్టి ఎన్నికల విధుల నుంచి జూనియర్ లెక్చరర్లను మినహాయించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు అధ్యాపకులు అందుబాటులో లేకపోతే వారు ప్రిపరేషన్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు.

క్రీడా ప్రాంగణాలు.. బోర్డులకే పరిమితం

వేంసూరు: మండంలోని కల్లూరుగూడెంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కేవలం బోర్డులకే పరిమితమైంది. ప్రాంగణంలో తుప్పు పట్టిన ఇనుప కడ్డీలతో పాటు.. ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నిండి ఉంది. మండలంలోని మొత్తం 26 గ్రామపంచాయతీల్లోని క్రీడా ప్రాంగణాలు.. కేవలం బోర్డులను ఏర్పాటు చేసి వదిలేశారు. తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఏ గ్రామానికి వెళ్లిన బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను వినియోగంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.



కల్లూరుగూడెంలో క్రీడా ప్రాంగణం

బీజేపీ విజయోత్సవ సంబరాలు

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు బీజేపీ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు సెంటర్లలో బాణసంచా కాల్చడంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ విజయం సాధించటం హర్షణీయమని.. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర : నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు


వైరా: మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు


సత్తుపల్లిటౌన్: సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు